అయితే కృష్ణుడు పరిపూర్ణఅవతారం. కృష్ణపరమాత్మ చెప్పిన శాస్త్రం భగవద్గీత. ఆయన చెప్పి సుమారు 5600 సంవత్సరాలు అయినా ఇప్పటికీ కొత్తగా ఉంది. యిప్పుడు భగవద్గీతను ఇతర దేశాలలో కూడా చదువుతున్నారు. భగవాన్ స్కంధాశ్రమం, విరూపాక్షగుహలో ఉండగా భక్తులు వచ్చి తిరిగి వెళ్ళేటప్పుడు ఎవరికయినా బూట్లు సరిగా పట్టటంలేదు అనుకోండి, భగవాన్ వారి దగ్గరకు వెళ్ళి వాళ్ళ కాళ్ళు పట్టుకొని బూట్లు పట్టించేవారు. వారు వద్దండి, వద్దండి అనేవారు, అయినా అటువంటి పనులు కూడా చేసారు. మరి నేను మహర్షిని అనుకొంటే వాళ్ళ కాళ్ళు ముట్టుకోగలరా. ఆయనకు ప్రపంచంలో అంతపేరు వచ్చినప్పటికీ, లోకం చేత పూజింపబడుతున్నప్పటికీ ఎక్కడా గర్వంలేదు, ఆ సమస్యే ఉండదు. ఆయన ఈ ప్రకృతిని దాటిపోయారు. ప్రకృతిగుణాలను దాటిపోయాక ఇది ఎక్కువ అనీ, తక్కువ అనీ లేకపోతే వారు ఏమనుకొంటారు, వీరు ఏమనుకొంటారు అని ఇటువంటి గొడవలు ఏమీ ఉండవు. మీరు ఏమయినా అనుకొంటున్నారేమో అని అనుకోవటానికి ఆయన దృష్టిలో మీరు లేరు, అంతా తానే, వారు తానుగా ఉంటారు కాని నేనుగా ఉండరు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-09-2015 జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు హైదరాబాద్ లక్ష్మి జయంతి. లక్ష్మి హైదరాబాద్‌లో భగవాన్ వర్కు కొంత చేసింది. వాళ్ళ బంధువుల ఇంటికి వెళ్ళినా, స్నేహితుల ఇంటికి వెళ్ళినా ఎక్కడికి వెళ్ళినా భగవాన్ గురించి తనకు తెలిసింది చెపుతూ ఉండేది. హైదరాబాద్‌లో చాలా కుటుంబాలలో భగవాన్‌ను పరిచయం చేసింది. మాకు లక్ష్మిద్వారానే భగవాన్ గురించి తెలిసింది అని చాలామంది భక్తులు చెప్పేవారు. లక్ష్మికి ఇక్కడ మనం జయంతి చేస్తున్నాము అంటే లక్ష్మి భగవాన్‌కు సంబంధించినపని చాలా చేసింది, చేసిన పని మనం కాదనకూడదు, చేసినమంచిని మనం కాదనకూడదు. హైదరాబాద్‌లో రమణకేంద్రం ఉన్నప్పటికి వారికంటే ఎక్కువగా లక్ష్మే భగవాన్‌ను పరిచయం చేసింది అనిపిస్తుంది. ఎవరు ఏ మార్గంలో ఉన్నా లక్ష్మి రమణమార్గం తప్పలేదు, భగవాన్ పట్ల విశ్వాసం ఎప్పుడూ చలించలేదు. భగవాన్ సద్భక్తు అంటే లక్ష్మికి బాగా ఇష్టం. లక్ష్మివాళ్ళు కొంతకాలం మధురానగర్‌లో ఉండేవారు. అప్పడు చాలామంది భక్తులు వస్తూ ఉండేవారు. అలా ఎక్కువమంది భక్తులు రావాలనే లక్ష్మి కూడా కోరుకొనేది. లక్ష్మి భగవాన్

చైల్డ్ కాబట్టి భగవాన్ మార్గం వ్యాప్తి చేయటానికి హైదరాబాద్ రమ్మని నన్ను ఆహ్వానించేది. లక్ష్మికి లోబిపి ఉండేది. నేను వచ్చినప్పుడు నువ్వు సికింద్రాబాద్ స్టేషన్‌కు రావద్దు, లోబిపి ఉన్నవాళ్ళు ఎప్పుడైనా పడిపోవచ్చు అని చెప్పినా, అనారోగ్యంగా ఉన్నా ఎప్పుడూ స్టేషన్‌కు రావటం మానలేదు. ముందు మా ఇంటికి వచ్చి రెండు రోజులు ఉండి, మీకు ఎక్కడికి వెళ్ళాలని ఉంటే అక్కడకు వెళ్ళండి అని చెప్పేది. లక్ష్మికి అదొక సంతోషం.

ఎక్కడ మీటింగు అయినా, నేను ఎవరి ఇంటి దగ్గర కూర్చున్నా లక్ష్మి నాకు దగ్గరగా కూర్చునేది. గురుపూర్ణిమ కాని, నా పుట్టినరోజున గాని స్టేజిమీద లక్ష్మి ఉండేది. అలా ఉండటం లక్ష్మికి సంతృప్తి. ఒక చిన్న సంఘటన చెపుతాను. నాకు కేన్సర్ లేకుండా కేన్సర్ ఉందని ఒకసారి డాక్టర్లు చెప్పారు. చివరకు హైదరాబాద్ వెళ్ళాము. అక్కడ కేన్సర్ లేదని నిర్ధారణ చేసారు, అక్కడ నుండి వచ్చేసాము. ఇంటికి వచ్చేసాక మరల వైజాగ్ తీసుకెళ్ళారు. అక్కడ డాక్టరు కూడా అది కేన్సర్ కాదు అని చెప్పారు. నాకు కేన్సర్ వచ్చిందా, లేదా అది డిఫరెంట్ విషయం. ఈ సంఘటన ఎందుకు చెపుతున్నాను అంటే లక్ష్మికి నాపట్ల ఉన్న ఆప్యాయతకోసం చెపుతున్నాను. నేను వైజాగ్ వెళ్ళాను అని తెలిసి లక్ష్మి ఫ్లైట్‌లో అక్కడకు వచ్చేసింది. అవసరం అయితే నేను కబురు పంపుదునుకదా, ఏమీ లేనిదానికి అనవసరంగా వచ్చేసావు అన్నాను. ఇప్పుడు కేన్సర్ లేదని నిర్ధారణ అయింది మంచిదే, కేన్సర్ ఉంటే మీరు అశ్రద్ధ చేసి జిన్నూరు వెళితే అది ఇంకా పెరిగిపోతుంది, మిమ్మల్ని ఇక్కడనుండి హైదరాబాద్ తీసుకొనిపోదామని వచ్చాను. ఇంక ఇప్పుడు క్లియర్ అయిపోయిందికదా! నేను వెళ్ళిపోతాను అని మరల ఫ్లైట్‌లో హైదరాబాద్ వెళ్ళిపోయింది. లక్ష్మి ఉండవచ్చు లేకపోవచ్చు, నా శరీరం చనిపోవచ్చు అది వేరే విషయం. శరీరాలు అన్నీ చనిపోతాయి. మాటలు మాత్రం చాలాకాలం నిలబడి ఉంటాయి. అంటే మాటకు ఉన్న జీవితం శరీరానికి ఉండదు. ఇప్పుడు భగవాన్ శరీరం ఇక్కడ ఉందా అంటే లేదు. పూర్వపు ఋషుల శరీరాలు ఇక్కడ ఉన్నాయా అంటే లేవు. కాని వారు చెప్పిన మాటలు మటుకు సజీవంగా ప్రపంచం మీద ప్రభావాన్ని చూపిస్తున్నాయి. రీలైజేషన్ పొందిన వారి మాటలు మన హృదయం యొక్క తలుపులు ఓపెన్ చెయ్యటానికి ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటాయి.

జీవితంలో ఎదురయ్యే సమస్యలను విడిచిపెట్టి ఎక్కడికి పారిపోకూడదు.

హిమాలయపర్వతాల వంటి పెద్ద పెద్ద సమస్యలు కూడా కాలప్రవాహంలో పరిష్కారం అయిపోతాయి. ఈ సృష్టిలో ఏ సంఘటనకు మనం వర్రీ పడనక్కరలేదు. చిన్న చిన్న విషయాలను మనం ఓవర్‌కమ్ చేయలేకపోతే ప్రకృతిని అతిక్రమించలేము. జీవితం అనేది జన్మాంతర కర్మ. యంత్రం చెరుకుగెడను ఎలా పిప్పి చేసి రసం తీస్తుందో అలాగ ఒకోజీవితాన్ని ప్రారబ్ధం పిండి పిప్పి చేస్తుంది. ప్రారబ్ధాన్ని మనం విసుగులేకుండా శాంతిగా ఫేస్ చెయ్యాలి. జీవితంలో ఎదురయ్యే క్లిష్ట సమస్యలను నువ్వు ఫేస్ చెయ్యలేకపోతే నీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేస్తే సంతోషం వస్తుంది, విమర్శిస్తే దుఃఖం వస్తుంది. అంటే మీకు ఆధ్యాత్మికంగా కనీసం ఎల్‌కెజి స్థాయి కూడా లేదు. ప్రారబ్ధం కొట్టే దెబ్బలను మనం తట్టుకోవాలి. పరిస్థితులు ఒకోసారి మనకు అనుకూలంగా ఉంటాయి. ఒకోసారి మనకు వ్యతిరేఖంగా ఉంటాయి. అనుకూలంగా ఉన్నప్పుడు ఫేస్ చెయ్యటం తేలికే కాని ప్రతికూలంగా ఉన్నప్పుడు ఎలా ఫేస్ చెయ్యాలి అనేది మనం జీవితంలో నేర్చుకోవాలి. లక్ష్మి యొక్క జీవుడు ఏ లోకంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా, కొన్ని పల్టీలు కొట్టినా తన పాదాల దగ్గరకు చేర్చుకొని, ఏదో జన్మలో తన స్వరూపాన్ని ఇచ్చే వరకు భగవాన్ లక్ష్మిని విడిచిపెట్టడు. హైదరాబాద్ జీవితం అంతా లక్ష్మి మర్చిపోయింది. లక్ష్మి ఇప్పుడు శాంతిగానే ఉంది ఎందుచేతనంటే ముందుగానే లక్ష్మి ఎంతోకొంత ఈశ్వరుడి కర్మ చేసింది. గీతలో ఒక మాట చెప్పాడు. నీ జీవితంలో కొంతకాలమైనా భగవంతుని పనిచేస్తే దానిని ఎవరు చెరిపేయలేరు. దానివల్ల మీకు ప్రతిఫలం ఉంటుంది.

సమస్యలను తట్టుకోవడానికి మీకు మానసికబలం ఉండాలి. సబ్జక్టు తాలూక లోతు ఉండాలి. మీకు దుఃఖం వస్తూ ఉంటే ఈ దుఃఖపడే నేను ఎవరు అని ప్రశ్నించండి. నిజమైన నేనుకు దుఃఖం రాదు, రాంగ్ఐకే దుఃఖం వస్తుంది. రాంగ్ఐ నిజంకాదు, దానికి దుఃఖం వస్తూ ఉంటే మనం వర్రీ పడుతున్నాము ఏమిటి అని ప్రశ్నించుకోవటం వలన మీ దుఃఖం అంతా కరిగిపోతుంది. ఆ దుఃఖపడే నేనును మొట్టికాయలు కొట్టాలి, అప్పుడు అది అణిగిపోతుంది. సబ్జక్టు తాలుక డెప్త్ ఉంటే హిమాలయపర్వతాల్లాంటి సమస్యలు కూడా దూదిలాగ విడిపోతాయి. సబ్జక్టుకు అంత బలం ఉంది. మీరు విన్న వాక్యాన్ని ఎనాలసిస్ చేసుకోవాలి. భగవాన్ చెప్పిన ఈ వాక్యాన్ని మీరు రోజూ మననం చేయండి. భగవాన్ ఏమన్నారు

అంటే ఏ పనిచేస్తే భవిష్యత్‌లో మీకు దుఃఖం వస్తుందో, ఏ పని చేస్తే మీకు భయం వేస్తుందో ఆ పనిని ఇప్పడే మీరు చెయ్యవద్దు, ఆ పనికి దూరంగా ఉండండి అని చెప్పారు. ఈ ఒక్క వాక్యం చాలు, ఇది మిమ్మల్ని రక్షిస్తుంది. రాగాన్ని, భయాన్ని, క్రోధాన్ని పోగొట్టుకోవటానికి నీ ప్రాణం పోయేవరకు జీవితం పొడుగునా సాధన చెయ్యి, ఎందుచేతనంటే ఈ మూడే నీకు అశాంతిని తీసుకొనివస్తున్నాయి. నువ్వు శారీరక బాధను భరించగలవు కాని, మానసిక అశాంతిని భరించటం చాలా కష్టం, ఆ బరువు మొయ్యటం చాలా కష్టం. సమస్యలనుండి పారిపోకుండా వాటిని ఫేస్ చెయ్యి. భక్తుల చరిత్రలు అందుకే మనం చదవాలి. పండరీపురం భక్తుల చరిత్రలు చూస్తూ ఉంటే వారు చాలా సమస్యలు ఫేస్ చేసారు, ఎక్కడా పారిపోలేదు. వారు చూపించిన వివేకం, వారు చూపించిన వైరాగ్యం, వారి నాలెడ్జ్‌యొక్క శక్తి ముందు పాండురంగడే ఓడిపోయాడు. ఏముందీ లోకంలో, విడదీసి చూస్తే ఏమీ లేదు. నువ్వు ఎవరి గురించి మోహపడుతున్నావో, ఎవరి గురించి దుఃఖపడుతున్నావో అసలు వాళ్ళు నీవాళ్ళు కాదు. అందుచేతనే గీత పొడుగునా పరమాత్మ చెపుతూ వచ్చాడు. నువ్వు చాకిరీ చేయటానికే పనికివస్తావు. వారికి ఉండే ప్రారబ్దం వాళ్ళకి ఉంటుంది, ఆ ప్రారబ్దం ప్రకారం వారి జీవితాలు వెళతాయి, వారిపట్ల నీ డ్యూటీ మాత్రం చెయ్యి.

**మత్కర్మకృత్ మత్పరమో మద్భక్తః సంగవర్జితః**
**నిర్వైరః సర్వభూతేషు యస్సమామేతి పాండవ**

మత్‌కర్మః అంటే నాకు యిష్టమైన కర్మ చెయ్యి. మీ మనస్సుకు నచ్చిన కర్మకాదు, ఏ కర్మ మంచిది అని నేను చెప్పానో ఆ కర్మను మీ మనస్సు అంగీకరించకపోయినా, మీ మనస్సుకు ఎదురీది చెయ్యండి. మీరు మంచిగా ఉండాలి అని అనుకొంటే మంచిగా ఉండలేరు, మంచికర్మలు చేస్తూ ఉంటే మంచిగా ఉండగలుగుతారు. డూ గుడ్ లేకుండా బీ గుడ్ సాధ్యంకాదు. మంచితనం కూడా అది ఒక గిఫ్ట్. అది ఎన్నో జన్మల పరిపాకం వలన వస్తుంది. చివరకు మంచితనమే ఆత్మజ్ఞానం కింద దారితీస్తుంది. మీరు ఏపని చేస్తే, ఆపని ఎలా చేస్తే మీలో ఉన్న అంతర్యామియొక్క అనుగ్రహానికి పాత్రులవుతారో అటువంటి కర్మను మాత్రమే చెయ్యండి. కర్మచేసేటప్పడు మీరు జాగ్రత్తగా ఉండాలి. ఒకవేళ మంచికర్మ చేసేశక్తి మీకు లేకపోతే పాడుకర్మకు దూరంగా ఉండండి. మత్‌పరమః అంటే నన్ను ఇష్టపడి

నన్ను ప్రేమించండి, నాయందు విశ్వాసం కలిగి ఉండండి. మీకు ఈశ్వరుడి పట్ల తపన ఉండాలి. సబ్జక్టు పట్ల మీకు ఇంటరెస్ట్ కుదిరితే, అది ప్రోపర్‌గా అర్థమవ్వటంకోసం పరమేశ్వరుడు మీ బుద్ధిని విశాలం చేస్తాడు. ఏదైనా వాక్యం తీసుకొన్నప్పుడు మీరు దానిని లోతుగా పరిశీలించాలి. మద్భక్తః అంటే మీరు నాకు భక్తులుగా ఉండండి. సంఘవర్జితః అంటే ఎక్కడా ఆసక్తి దోషం పెట్టుకోవద్దు. మీ బంధువులకుగాని, స్నేహితులకుగాని మీరు ఏదైనా ఉపకారం చేయవచ్చు కాని అక్కడ ఆసక్తి పెట్టుకోవద్దు. ఆసక్తి వలన మనస్సు పాడవుతుంది. మీరు ఇతరులకు సహాయం చేయటం వలన మీ హృదయం యొక్క లోతులు పెరుగుతున్నప్పటికీ, ఆసక్తి దోషం వలన మీరు లోపల కుళ్ళిపోతారు. చూడటానికి కాని, వినటానికి కాని ఏముంది లోకంలో? ఈ లోకంలో ఏమీ లేదు. ఉన్నదంతా మీ హృదయంలోనే ఉందికాని బయట ఏమీ లేదు. మనకు ఉన్న ఎటాచ్‌మెంట్ వలన ఇక్కడ ఏదో ఉంది అని మనకు అనిపిస్తుంది. నువ్వు మంచి కర్మ చేసినా నీకు రేణింపు లేకపోవటానికి ఆసక్తి దోషమే కారణం. ఇతరుల ప్రవర్తన ఎలా ఉన్నా నీకు ఎవరిపట్ల వైరభావన వద్దు. వైరభావన ఉంటే మీకు తెలియకుండా మీ మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళిపోతుంది. ఎక్కడా మీకు ఇష్టంలేదు అనుకోండి, ఎక్కడా మీకు అయిష్టం లేదు అనుకోండి ఇంక మీ మనస్సు కదలమన్నా కదలదు. రాగద్వేషాలే మనిషిని పీడిస్తున్నాయి. ఈ రాగద్వేషాల యొక్క వేగాన్ని శరీరం ఉండగా ఎవడైతే తట్టుకుంటాడో, వాడి శరీరం చనిపోకముందే ఉత్తమ సుఖాన్ని పొందుతాడు. అది అలౌకిక సుఖం, అభౌతిక సుఖం, అది స్వతంత్రమైనది, అది ఈ ప్రపంచానికి సంబంధించినది కాదు అని మీకు తెలుస్తూ ఉంటుంది. నిర్వైరః సర్వభూతేషు అంటే సమస్త ప్రాణులయందును ద్వేషం లేకుండా ఉండాలి. మీపట్ల ఎవరికైనా వైరం ఉన్నా అది మీకు సంబంధం లేదు, మీరు మాత్రం ఎవరిపట్ల వైరం పెట్టుకోవద్దు. వీళ్ళు నావాళ్ళు, వాళ్ళు పరాయివాళ్ళు అనేబుద్ధి అక్కరలేదు. అందరూ మనవారే, అందరి క్షేమం కూడా మనం కోరుకోవాలి.

**అనపేక్ష శ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః**

**సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్తస్సమేప్రియః**

అనపేక్షః అంటే ఏమీ అపేక్ష లేకుండా ఉండటం, కోరిక ఏమీ లేకపోవటం. మీరు

ఎక్కడా ఏమీ కోరిక పెట్టుకోవద్దు. మీ జీవితంలో ఏది జరగాలో అది జరుగుతుంది. మీ దేహప్రారబ్దంలో ఉంటే మీ కోరికతో సంబంధం లేకుండా అది వస్తుంది. కోరిక లేకపోతే మనకు ఆ పనులు అవ్వవేమో అని మీరు అనుకొంటారు. మీ దేహప్రారబ్దంలో ఉంటే మీ కోరికతో సంబంధం లేకుండా పరమేశ్వరుడు మీకు అనుగ్రహిస్తాడు. కోరిక ఉండటానికి, లేకపోవటానికి సంబంధం లేదు. కోరిక లేకుండా అనేకమంది ధనవంతులు అయినవారు ఉన్నారు, మీకు కోరికలు లేవని మీకు ఎలా తెలుసు. పరిస్థితులు ప్రభావం వచ్చినప్పడు కాని వారికి కోరికలు ఉన్నాయో, లేవో తెలియదు. సాధకులు ఎవరిని అనుకరించవద్దు. అనుకరణ అనేది పిరికివాని లక్షణం. పిరికితనం ఉంటే ఆత్మజ్ఞానం రాదు అని ఉపనిషత్‌లలో చెప్పాడు. పిరికితనం ఉన్నవాడు సాధన చేసినా అది నిలబడదు. వాళ్ళు ఏమి అనుకొంటున్నారు, వీళ్ళు ఏమి అనుకొంటున్నారు అనుకోవటానికి అసలు ఇతరులు ఉంటే కదా! వారు మిమ్మల్ని విమర్శిస్తున్నారు అని భగవాన్‌తో అంటే ఆయన మౌనంగా ఉండేవారు, అసలు పట్టించుకొనే వారు కాదు అంటే జ్ఞానికి ఇతురులు లేరు. అహంకారం లేనివాడికి ఇతరులు లేరు ఇంక అనుకోవటం ఏమిటి?

మీ చుట్టాలు మీతో మాట్లాడకపోతే కంగారుపడిపోతారు. రోజూ మనతో స్నేహంగా ఉండేవాడు ఒకరోజు మాట్లాడకపోతే ఏమిటి పలకరించటం లేదు అని కంగారుపడిపోతారు. ఇప్పడు రామకృష్ణుడికి ఈ ప్రపంచం అంతా శత్రువు అయింది అనుకోండి, వారికి ఏమీ అనిపించదు, అది వారికి గడ్డిపరకతో సమానము. అది జ్ఞానవైభవం. శుచిర్ధక్షః అంటే లోపల శుచి ఉండాలి, బయట శుచి ఉండాలి. కుండకు చిల్లు ఉంటే అందులో నీళ్ళు పోసినా నిలబడవు కారిపోతాయి అలాగే నీ మనస్సులో శుచి లేనప్పడు నువ్వు సాధన చేసినా అది నిలబడదు. నీ మాటలో శుచి ఉండాలి, నీ ప్రవర్తనలో శుచి ఉండాలి, వ్యవహారంలో శుచి ఉండాలి. లోపల అంతఃకరణంలో శుచి ఉండాలి, బయట నీ ప్రవర్తనలో శుచి ఉండాలి. నిన్న అలా తోచింది కాబట్టి అలా చెప్పాను, ఈ రోజు ఇలా తోచింది కాబట్టి ఇలా చెపుతున్నాను అంటారు. కొంతమంది మాట్లాడేమాటకు అర్థం ఉండదు, అస్తవ్యస్థంగా మాట్లాడతారు, అలాకాదు ఒక క్రమం ఉండాలి. ఉదాసీనః అంటే నువ్వు చాలా విషయాలలో తటస్థుడిగా ఉండటం మంచిది. అన్ని విషయాలలో మనం కలుగజేసుకోకూడదు. ఎవరైనా

వచ్చి మిమ్మల్ని సలహా అడిగితే మీకు తోచింది చెప్పవచ్చును కాని మీ అంతట మీరు వెళ్ళి కలుగజేసుకొంటే మీరు మంచికోసం చెబితే చెడ్డ ఎదురువస్తుంది. వారికి అర్థం చేసుకొనే శక్తి లేనప్పుడు మంచికూడా చెడ్డగా కనిపిస్తుంది. లోపల శుచి లేనప్పుడు ఎదుటివాళ్ళ మంచి కూడా మీకు బలహీనతగా కనిపిస్తుంది.

గతవ్యథః అంటే జరిగిపోయిన విషయాలగురించి దిగులుపడవద్దు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీ జీవితంలో ప్రారబ్ధాన్ని బట్టి ఇప్పటివరకు అనేక సంఘటనలు జరిగి ఉంటాయి. జరిగిపోయింది ఏదో జరిగిపోయింది. జరిగిపోయిన గొడవలు మరల తలపెట్టుకొంటూ దుఃఖపడటం సాధకుడి లక్షణంకాదు. జరిగిపోయిన గొడవలు మర్చిపోతే మీ నెత్తిమీద ఉన్న బరువు అంతా దిగిపోతుంది. జరిగిపోయిన గొడవలు మర్చిపోండి, అది కూడా సాధనలో ఒక భాగం. గతాన్ని ఇంక రానివ్వకూడదు. మీకు జరిగిపోయినవి ఎక్కువగా గుర్తు వస్తూ ఉంటే భవిష్యత్ మిస్ అయిపోతారు, వర్తమానం కూడా వేస్ట్ అయిపోతుంది. అందుచేత గతం ఇంక మీకు కనబడకూడదు. ఫర్‌గెట్ ది పాస్ట్. జరిగిపోయిన గొడవలు మరిచిపోతే నీకు చాలా తేలికగా ఉంటుంది, సాధన బాగా సాగుతుంది, నీకు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుంది. నిర్వైరం గురించి భగవంతుడు ఎక్కువగా చెప్పాడు. వైరం చల్లారకపోతే చాలా ప్రమాదం. వైరం వైరం వల్ల చల్లారదు ఆప్యాయతవల్ల, ప్రేమవల్ల వైరం చల్లారిపోతుంది. సర్వ ఆరంభ పరిత్యాగి - శాస్త్ర విరుద్ధంగా చెపితే ఆ కర్మను విడిచిపెట్టు. ఈ కర్మ మంచిది కాదు అని శాస్త్రం చెబుతూ ఉంటే, భగవంతుడు చెపుతూ ఉంటే అటువంటి కర్మల జోలికి వెళ్ళవద్దు. ఎందుచేతనంటే అటువంటి కర్మలు చేయటం వలన ఒకవేళ ఈ జన్మలో అవి నిన్ను వదిలివేసినా రాబోయే జన్మలో అదే నిన్ను వెంటాడుతుంది.

మీకు ఒకోసారి అదృష్టం వెంటాడుతూ ఉంటుంది, ఒకోసారి దురదృష్టం వెంటాడుతుంది. ఏది వెంటాడినా దాని ప్రభవాం మీమీద పడకుండా చూసుకోండి. అదృష్టం అయినా, దురదృష్టం అయినా మీ శరీరానికే పరిమితం. దేహమే ప్రారబ్దం అనుభవిస్తుంది. బ్రాహ్మీస్థితి పొందిన వాడిని ప్రారబ్దం కూడా ఏమీ చెయలేదు. బ్రాహ్మీస్థితిని పొందినవాడికి దుఃఖం అనే సమస్యలేదు, భయం అనే సమస్య లేదు. జ్ఞానికి ద్వితీయం లేదు. ద్వితీయం లేనప్పుడు ఇంక భయం ఏముంది? ఎవరిని చూసి మీరు భయపడతారు? అంతా మీరే

అనుకొన్నప్పుడు ఇంక భయం ఏమిటి? నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా బంధంలో నుండి విడుదల పొందాలి. మీరు ప్రశాంతంగా కూర్చుంటే మీ మనస్సు అటు ఇటు కదులుతోంది అనుకోండి, లేకపోతే మీకు దుఃఖం వస్తోంది అనుకోండి ఎక్కడో బంధం ఉందని గుర్తు. ఎక్కడా బంధం లేకపోతే మన మనస్సు కదలదు, మీకు దుఃఖం రాదు. బంధం చాలా ప్రమాదం, ఈ జీవుడిని ప్రపంచానికి కట్టేసేది కూడా అదే.

భగవంతుడు ఏమని చెపుతున్నాడు అంటే మీరు నన్నే గమ్యంగా పెట్టుకోండి. అంటే మీరు జీవితంలో ఏ పని చేస్తున్నప్పటికీ నన్ను గమ్యంగా పెట్టుకోండి. నేను సంతోషించే కర్మలు చేయండి. మీరు మానవసేవ చేయవచ్చు. మానవసేవ చేసేటప్పుడు అందరిలోను నన్ను చూస్తూనే సేవ చెయ్యాలి ఎందుచేతనంటే అందరి హృదయాలలో ఉన్నవాడిని నేనే. నామరూపాల గొడవ మీకు అక్కరలేదు, నామదృష్టి రూపదృష్టి మిమ్మల్ని బంధిస్తాయి. అందుచేత లోపలఉన్న పరమేశ్వరుని చూస్తూ మీరు చేయవలసిన సేవ, మీరు చెయ్యవలసిన డ్యూటీ చేయండి. ప్రతీ మనిషిని ఏదోవాసన పీడిస్తూ ఉంటుంది. వాళ్ళకు ధనం ఉంటుంది, చదువు ఉంటుంది అవసరాలు అన్నీ తీరుతూ ఉంటాయి. కాని వారు సుఖంగా ఉండలేరు, శాంతిగా ఉండలేరు. మీకు అన్నానికి లోటులేదు, బట్టకిలోటులేదు, నీడకు లోటులేదు అయితే మీరు సుఖంగా, శాంతిగా జీవించగలుగుతున్నారా? మీరు సుఖంగా ఉండలేకపోతున్నారు, ఇవి సరిపోవని దీనిని బట్టే మీకు తెలుస్తోంది కదా! మరి ఎందుకు సుఖంగా, శాంతిగా ఉండలేకపోతున్నారు. మీ లోపల రకరకాల వాసనలు ఉన్నాయి, ఏదో వాసన మిమ్మల్ని చనిపోయేవరకు పీడిస్తూనే ఉంటుంది. ఏదో డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ ఉంటేనేగాని వాసన క్షీణించదు. మన జీవితగమ్యం వాసనాక్షయం అని బుద్ధుడు చెప్పాడు. మనకు ఎన్ని సమస్యలు ఉన్నా ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విషయం గుర్తుపెట్టుకోవాలి. ప్రతీ సమస్యా ఈ గంటలోనే పరిష్కారం అయిపోవాలి అని కంగారు పడకూడదు. ప్రతీ సమస్య పరిష్కారం అవ్వటానికి కొంత టైము పడుతుంది. నాలుగు రోజులలో జరగవలసింది ఇప్పుడే జరిగిపోవాలి అంటే కుదరదు. మనకు ఏ రోజున మరణం రావాలో ఆ రోజునే వస్తుంది కాని మనం కంగారు పడ్డామని ముందు వచ్చేయదు, మనం అజాగ్రత్తగా ఉన్నామని వెనక్కి వెళ్ళదు. ఏది ఎప్పుడు జరగాలో అప్పుడు జరుగుతుంది, అది ఈశ్వర నిర్ణయం. దేహాన్ని ప్రారబ్దానికి వదిలేయండి, మనస్సును పవిత్రం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి.

నవంబరు 25 దీపం - జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# దీపం

కార్తీకమాసం అనగానే మనకు అరుణాచలదీపోత్సవం అనగా, బ్రహ్మవిష్ణువులకు ఈశ్వరుడు జ్యోతిరూపంలో దర్శనమిచ్చిన రోజు గుర్తుకు వస్తుంది. మన సాంప్రదాయంలో దీపారాధన ప్రధానమైనది. దీపాన్ని వెలిగించి పూజా కార్యక్రమములు మున్నగునవి మొదలుపెడతాం. వెలుగు జ్ఞానానికి గుర్తు, చీకటి అజ్ఞానానికి గుర్తు. బాహ్యమైన దీపము అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న పరమాత్మకు గుర్తు. తానుగా ప్రకాశించే జ్యోతులకు జ్యోతి మన స్వరూపంగానే ఉంది, అందువల్లనే దీపమును సాక్షాత్తూ పరబ్రహ్మస్వరూపంగా ఆరాధించడం మన ఆచారంగా వస్తోంది. యదార్థంగా జ్యోతిస్వరూపమే అయిన అరుణగిరి మన మాంసనేత్రాలకు మాత్రం శిలాకారంగా కనిపిస్తుంది అంటారు భగవాన్ శ్రీరమణులు. బ్రహ్మవిష్ణువులకు ఆది అంతము లేని జ్యోతిరూపంగా గోచరించిన మహాచైతన్యమే తరువాత అరుణగిరి రూపు దాల్చింది. దీపం వెలిగించుకొంటే చీకటి ఉండమన్నా ఉండదు, అదేవిధంగా దేహేంద్రియమనోబుద్ధులు తానుకాదని, బ్రహ్మమే తానని తెలిసిన పిదప అజ్ఞానమంటూ ఉండదు. సత్యవస్తువు మన హృదయంలో స్వరూపంగా ఉంది. మన కపటబుద్ధి నుండి, దురలవాట్లనుండి, ద్వంద్వాలనుండి, విడుదలపొందితే లోపల ఉన్న సద్వస్తువు సహజంగా తానుగా వ్యక్తమవుతుంది. హృదయంలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ మన వాక్కుకు, మనస్సుకు అందడు. అయితే ఎవరి వాక్కు శుద్ధమై, మనస్సు నిర్మలమవుతుందో, అట్టి వారికి అందుతాడు. మనస్సు యొక్క మూలంలో మహాచైతన్యం, మహావెలుగు ఉంది. మనస్సుకు అంతరదృష్టి కలిగి, దాని మూలాన్ని అది చూస్తేగాని నశించదు. మనస్సు నశిస్తే కాని వాస్తవంగా తానెవరో? తెలియబడదు. తానెవరో? తెలియబడితే కాని మానవునికి స్వేచ్ఛలేదు, ఆనందంలేదు. కాబట్టి దేహం జీవించి యుండగానే జ్ఞానసముపార్జనకోసం ప్రయత్నించాలి.

**ఓంతత్సత్**

**(దిII 25-11-2015 అరుణాచల దీపోత్సవం సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# సంకల్పమే దైన్యానికి నరకానికి దారి తీస్తుంది

మానవ జీవితంలో అభద్రత ఉంటుంది. అడుగడుగునా ప్రమాదం ఉంది. క్షణంలో మిత్రుడు క్షణంలో శత్రువు అది అంగీకరించవలసిందే. ఆస్థి అంతా పోయి నష్టం రావచ్చు ఆ పరిస్థితిని గ్రహించి స్వీకరించటంవల్ల భయరహితులమవుతాము. మనం రేపు గుడ్డి వాళ్లము, కుంటి వాళ్లము కావచ్చు. సంసారాలు విడిపోవచ్చు, మన తల్లిదండ్రులు వ్యతిరేకం కావచ్చు, ఇల్లు కూలవచ్చు అంగీకరించవలసిందే. భయం ఉంటుంది. అది జీవిత స్వభావం అని తెలుసుకొన్నవారు దైన్యానికి గురికారు. ఈ అవగాహన రోజూ జరిగే సంఘటనలో గుర్తుకు తెచ్చుకోవాలి. మానేస్తే దైన్యానికి గురి అవుతారు. ఇన్ని సంఘటనలు ఆత్మకులేవు, అన్ని మనం ఆపాదించుకొన్న సంకల్పాలే. ఆనందానికి పర్యాయపదం 'స్వేచ్ఛ'. పిరికివారికి స్వేచ్ఛ ఉండదు. స్వేచ్ఛ ఉండాలంటే మనోశరీరాలతో తాదాత్మ్యతను వదులుకోవలసి ఉంటుంది. కానప్పడు జీవితం నరకమే అవుతుంది. సగటు మనిషి తనంతట తాను తీర్మానాలను చేసుకొంటాడు. ఈ వర్గీకరణ తెలివితక్కువతనం. అల్పము, అధికమనే తీర్మానాలు ఆత్మలోలేవు అది పూర్ణమైన సమత్వంలో ఉంది. సృష్టి అంతా దానిలోనే ఉంది. గాంధీజీ "నేను ఈ రాజ్‌కోట ప్రయాణానికి ఎందుకు వెళుతున్నానో నాకు తెలియదు ఈశ్వరుడు నడుపుతున్నాడు నా సంకల్పాలు, ఊహలు వ్యర్థం" అన్నారు. సాక్షాత్కారం కలిగిన తరువాత ఆ మాటలు రుజువు అవుతాయి. మన శరణాగతి నిజమైతే సంకల్పాలు కొనితెచ్చుకోము. ఎరుక లేకపోవటం దురవస్థలకు దుఃఖాలకు కారణమౌతాయి. ఎరుక అనే దీపం ద్వారా మనస్సులో అజ్ఞానమనే చీకటి అంతా మాయమౌతుంది. అన్ని మంచి కర్మల కన్న మహత్వ పూర్వకమైనది ఎరుకగా ఉండటం. దానివల్లనే అన్ని సంపదలు, అన్ని సుఖాలకు అది మూల ద్రవ్యం. ఆయుధం లేకుండా కోతులగుంపును తరమాలనుకొంటే అవి మనపై పడి పీకి కరుస్తాయి. అలాగే ఎరుకలేకపోతే సందేహాలు, సంకటాలు మన జీవితాన్ని పీక్కొని తింటాయి. సంకల్పం పోతే స్థిరత్వం కలుగుతుంది. అది సహజమైన మౌనం. పశువుల కాపరి పశువులను తోలుకొనిపోతున్నట్లు ఎరుక లేకపోతే పశుపతి మనలను చావుపుట్టుకలు అనే రహదారిలో తరుముతాడు. మన సంకల్పాలతో మన గోతులను మనమే తవ్వుకొంటున్నాము. కారణం మనస్సు గందరగోళంగా ఉంది. కర్మలను ఉన్నది ఉన్నటు యదాలాపంగా సాగనియ్యాలి. దీన్ని వ్యతిరేకిస్తున్నాను అని ఏటికి ఎదురీదకూడదు. మన ఆలోచనలు, ఊహలు, కోరికలయొక్క అసలు ఉద్దేశ్యం ఏమిటి? అని గ్రహిస్తే గతంలో మనం సంపాదించిన విత్తనాలు ఎప్పడు ఏవో ఏవో ఆలోచిస్తాయి. ఈ రోజు ఎరుకతో సంతోషంగా ఉండకపోతే ఈ క్షణం ద్వారానే ఈ సంకల్పాలు రేపు పురుడుపోసుకొని మహావృక్షాలు అవుతాయి. అప్పడు ఆశలన్నీ నీరు కారి నిరాశాకూపంలో కూరుకుపోతాము. ప్రకృతి ఆశలు పెట్టుకోవటం పిల్లచేష్టలు. ఆ ఆశలతో బ్రతికే మనిషి జీవితాన్ని ఆవిరిచేసుకొంటాడు. ఆత్మానందం మహా లోతైనది. ఇతరుల ఆస్థి మీద మనకు అసూయత కలిగితే మనం దొంగలమే వారి ఆస్థి దోచుకోకపోవచ్చు. వారి ఆస్థి మీద కోరికతో దొంగతనం ప్రారంభమై అస్థిత్వపు కోర్టు పట్టుబడతాము. అది రుజువు అవుతుంది. మనస్సే పెద్ద గజదొంగ. డబ్బై ఏళ్ళు వచ్చిన గత అనుభవాలతో జీవిస్తాము. పసి పిల్లలకు ఏ కోరికా ఉండవు. వాళ్ళు దేవుళ్లతో సమానం.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966